

# రోడ్డు ఓపెన్

నమస్తే ఎఫెక్ట్

జ్యోతినగర్‌లో తెరుచుకున్న రోడ్డు

కరీంనగర్ కార్పొరేషన్, అక్టోబర్ 26 : కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో చెత్త ఎక్కువగా వేస్తున్నారని నగరపాలక సంస్థ అధికారులు ఏకంగా ఒక రోడ్డును మూసివేయగా, దీనిపై 'నమస్తే తెలంగాణ'లో ఈనెల 26న 'చెత్త పోగైతున్నదని రోడ్డు మూసేశారు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. నగరపాలక పారిశుధ్య విభాగం అధికారులు రోడ్డు అడ్డుగా వేసిన సామగ్రిని శనివారం తొలగించి రోడ్డును తెరిచారు.

# నర్సింగ్ కళాశాలలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లు

## నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

కరీంనగర్ విద్యానగర్, అక్టోబర్ 26 : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కరీంనగర్‌తోపాటు రామగుండం నర్సింగ్ కళాశాలలకు ప్రభుత్వం ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లు, ఇన్‌చార్జి వైస్ ప్రిన్సిపాళ్లను నియమించింది. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన నర్సింగ్ కళాశాలకు ఎస్టాబ్లిష్మెంట్ కోసం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నిజామాబాద్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కేడర్‌లో పనిచేస్తున్న అనితను నియమిస్తూ తెలంగాణ మెడికల్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెక్రెటరీ డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024 -25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతుండడంతో ఈ విద్యా సంవత్సరం నుంచి క్లాస్‌ల నిర్వహణ కోసం సిబ్బందిని నియమించారు. ఇన్‌చార్జి వైస్ ప్రిన్సిపాల్‌గా సిరిసిల్ల నర్సింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న లీలావతిని నియమించారు. అదేవిధంగా రామగుండం నర్సింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా జగిత్యాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ప్రసూనను, సిరిసిల్ల నర్సింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న సుశీలను ఇన్‌చార్జి వైస్ ప్రిన్సిపాల్‌గా నియమించారు. అడ్మిషన్లు పూర్తికాగానే పూర్తిస్థాయిలో లెక్చరర్లను నియమించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

- ఉమ్మడి జిల్లాలో చతికిల
- అక్టోబర్‌లో భారీ ప్రభావం
- సగానికి పడిపోయిన క్రయవిక్రయాలు
- 45 శాతానికి తగ్గిపోయిన ఆదాయం
- అన్నిరంగాలపైనా ఎఫెక్ట్
- ఇప్పటికే ప్రొడక్షన్ హాలిడే ప్రకటించిన గ్రానైట్ కటింగ్ అసోసియేషన్
- ఇదే దారిలో ఇటుక బట్టీలు
- భవిష్యత్ ఎలా ఉంటుందోనన్న ఆందోళన

# రియల్ ధమాల్?









**రియల్ రంగానికి కేరాఫ్‌గా ఉన్న కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఒక్కసారిగా చతికిల పడింది. కొంత కాలంగా ఈ ప్రభావం కనిపిస్తున్నా, అక్టోబర్‌లో మాత్రం పరిస్థితి మరీ దారుణంగా మారింది. గడిచిన నెలలతో పోలిస్తే క్రయవిక్రయాలు దాదాపుగా నిలిచిపోవడంతో రిజిస్ట్రేషన్ల ఆదాయం 45 శాతానికి పడిపోయింది. 13 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి ఉండగా, దీని ప్రభావం అనుసంధాన రంగాలపై భారీగా పడుతున్నది. మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో అపార్ట్‌మెంట్లు, సొంత గృహాలు, వాణిజ్య భవనాల వంటి కన్‌స్ట్రక్షన్స్ నెమ్మదించగా, ఈ ఎఫెక్ట్ గ్రానైట్‌పై పడింది. ఇంకా ఇటుక, సిమెంట్, కంకర వంటి వాటిపైనా పెను ప్రభావం చూపుతుండగా.. భవిష్యత్ ఎలా ఉంటుందో అన్న ఆందోళన ప్రస్తుతం నిర్మాణరంగంలో కనిపిస్తున్నది.**

కరీంనగర్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : హైదరాబాద్, వరంగల్ వంటి నగరాల తర్వాత రియల్ ఎస్టేట్ రంగానికి కేరాఫ్‌గా నిలిచింది కరీంనగర్ ఉమ్మడి జిల్లా. ప్రధానంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ, కమర్షియల్ స్థలాల ధరలు ఊహకు అందనంతగా పెరిగాయి. పల్లెల్లో ఒకనాడు ఐదు నుంచి ఏడు లక్షలు ఉన్న ఎకరం భూమి, దాదాపు ₹20లక్షల నుంచి ₹40కి లక్షలకు పెరిగిన పరిస్థితులున్నాయి. సమైక్యరాష్ట్రంలో కొనుగోలుకు ఉపయోగపడని స్థలాలు సైతం కోట్ల ధరలు పలికాయి. ప్రధానంగా కాళేశ్వరం జలాలు రావడంతో వ్యవసాయ భూముల ధరలు అమాంతం పెరిగాయి. ఒకప్పుడు కరువుకు కేరాఫ్‌గా ఉన్న మండలాలు పచ్చగా మారడం, రైతుబంధు అందడం, ఉచిత విద్యుత్ నిరంతరంగా సరఫరా కావడం వంటి అనేక కారణాల వల్ల సాగు భూములకు ఆనాడు రెక్కలొచ్చాయి. ఈ క్రమంలోనే క్రయవిక్రయాలు జోరుగా సాగాయి, కానీ, ప్రస్తుతం పరిస్థితి తారుమారైనట్టు కనిపిస్తున్నది. ప్రధానంగా ఇటీవల హైదరాబాద్‌లో చేపట్టిన హైడ్రా ప్రభావం ఉమ్మడి జిల్లాలపై స్పష్టమవుతున్నది. గడిచిన మూడేళ్ల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు చూస్తే.. ఉమ్మడి జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను కలిపి ప్రతినెలా సుమారు 7 నుంచి 8వేల క్రయవిక్రయాలు జరిగినట్టు వెల్లడవుతున్నది. ఒక్కో నెలలో ఈ సంఖ్య తొమ్మిది వేలకు పైగా పెరిగింది. అలాగే రెవెన్యూ కూడా ప్రతి నెలా సుమారు ₹20కోట్ల నుంచి ₹25 కోట్ల వరకు వచ్చింది. కానీ, అక్టోబర్‌లో మాత్రం ఉమ్మడి జిల్లా మొత్తంగా కేవలం 3,115 రిజిస్ట్రేషన్లు జరిగాయి. దీని ద్వారా కేవలం ₹9.77 కోట్ల ఆదాయం సమకూరింది. క్రయవిక్రయాలు ఒక్కసారిగా తగ్గిపోవడంతో ఆదాయం 45 శాతానికి పడిపోయింది. వచ్చే నవంబర్‌లోనూ అదే పరిస్థితి కొనసాగే అవకాశమున్నది. ఈ నెలలో ఇంకా దారుణమైన పరిస్థితులున్నాయని రిజిస్ట్రేషన్ శాఖాధికారులు ద్వారా సమాచారం తెలుస్తున్నది. నిజానికి దసరా పండుగ తర్వాత మార్కెట్ కుదుటపడుతుందని అందరూ ఆశించినా, ఆ పరిస్థితి మాత్రం కనిపించడం లేదు. పైగా రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



## అన్ని రంగాలపై పెను ప్రభావం

రియల్ రంగం దెబ్బతినడంతో ఈ ప్రభావం నిర్మాణ రంగానికి అనుసంధానంగా ఉన్న అన్ని రంగాలపై పడుతున్నది. ఇటుక ఉత్పత్తి 20 నుంచి 30 శాతానికి తగ్గిపోయింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 125 మందికి పైగా ఇటుక తయారీదారులు ఉన్నారు. గత లెక్కలు తీసుకుంటే ఏటా వంద కోట్ల ఇటుకలు తయారు చేసేవారు. అందులో పెద్దపల్లి జిల్లాలోనే దాదాపు 50కోట్లకుపైగా ఇటుకలు, మిగిలిన కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్లలో కలిపి రూ. 50కోట్ల వరకు తయారయ్యేవి. నాలుగైదు నెలలుగా నిర్మాణ రంగంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఇటుక విక్రయాలపై ప్రభావం పడుతున్నది. దీంతో ఇటుకబట్టీల దారులు ప్రొడక్షన్ తగ్గించారు. కొన్ని చోట్ల ధరలు తగ్గించి అమ్ముతున్నారు. నిజానికి ప్రతి వేసవిలో తయారు చేసే ఇటుక అక్టోబర్ నాటికి పూర్తయ్యేది. కానీ, ఈ సారి మార్చి వరకు వచ్చే అవకాశాలున్నాయని నిర్మాణదారులు అంటున్నారు. అలాగే, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కేంద్రంగా పనిచేసే రెండు సిమెంట్ కంపెనీలు తమ ప్రొడక్షన్‌లో 20శాతం వరకు తగ్గించాయని చెబుతున్నారు. అలాగే కంకర ఉత్పత్తితోపాటు ఆర్ఎంసీ కంపెనీలకు కూడా ఈ సెగ తాకుతున్నది. నిర్మాణ రంగంలో నెలకొన్న ప్రభావం.. ఉమ్మడి జిల్లాలోని గ్రానైట్ వ్యవస్థపైనా పడింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 380కిపైగా గ్రానైట్ కటింగ్ మిషన్లు నడుస్తుండగా, ఈ మిషన్ల ద్వారా దాదాపు ఏటా రెండు కోట్ల ఎస్ఎఫ్‌టీ వరకు గ్రానైట్ ఉత్పత్తి చేస్తున్నారు. నిర్మాణ రంగం కుదేలు కావడం, ఇప్పట్లో కోలుకునే అవకాశాలు కనిపించకపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో చాలా కటింగ్ మిషన్లు రోజువారీ కార్యకలాపాలు నడిపించడానికే యజమానులు నానా తిప్పలు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రతి ఆదివారం ప్రొడక్షన్ హాలిడే ప్రకటించి ఉత్పత్తి నిలిపివేస్తున్నారు. ఈ పరిస్థితులు ఎటువైపు దారి తీస్తాయో అన్న ఆందోళన అన్ని రంగాల్లో నెలకొంది. అంతేకాదు, భవిష్యత్ ఏరకంగా ఉంటుందోనన్న భయం ఆయా నిర్మాణ రంగాల్లో స్పష్టంగా కనిపిస్తున్నది.

**జనవరి నుంచి అక్టోబర్ వరకు ఉమ్మడి జిల్లాలో జరిగిన రిజిస్ట్రేషన్లు, వాటి ద్వారా వచ్చిన ఆదాయ వివరాలు**

| నెల | రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్లు | వచ్చిన ఆదాయం (లక్షల్లో) |
|---|---|---|
| జనవరి | 7,149 | 2144.54 |
| ఫిబ్రవరి | 8,088 | 2507.89 |
| మార్చి | 8,336 | 2506.89 |
| ఏప్రిల్ | 6,485 | 1991.02 |
| మే | 7,362 | 2187.68 |
| జూన్ | 7,280 | 2379.78 |
| జూలై | 9,528 | 3229.06 |
| ఆగస్టు | 6,902 | 2167.34 |
| సెప్టెంబర్ | 6,790 | 1927.96 |
| అక్టోబర్ | 3,115 | 977.87 |
| మొత్తం | 71,035 | 22,019.98 |



## బోరు, బావి, ఇల్లు రికార్డు చేయలేదు

..పక్క ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తిపేరు రొడ్డ సాయికృష్ణ. ఊరు మంథని మండలం పుట్టపాక. ఇతనికి గ్రామ శివారులోని సర్వే నంబర్ 379, 380లో 32 గుంటల వ్యవసాయ భూమి ఉంది. నేషనల్ హైవే కోసం అధికారులు భూమిని తీసుకున్నారు. మొదటి విడుత పరిహారం పంపిణీలో ఎకరానికి ₹6లక్షలు ఇస్తున్నారని, అందులో అవకతవకలున్నాయని అప్పుడు సాయికృష్ణ సంతకం చేయలేదు. తర్వాత అధికారులు పరిహారాన్ని పెంచారు. అయితే 32 గుంటల భూమితో పాటు బోర్, బావి, ఇల్లు కూడా హైవే నిర్మాణంలో పోతుండగా, అధికారులు బోరు, బావి, ఇల్లును మాత్రం రికార్డు చేయడం లేదు. వ్యవసాయ భూమిలో ఉన్న బోర్ ఆన్ చేసి చూపించినా, కరెంట్ బిల్లు, ఇంటి ఘర్‌పట్టి బిల్లులు ఇలా అన్నీ చూపించినా పట్టించుకోలేదు. ఇప్పటి వరకు పరిహారం కింద సాయికృష్ణకు ఒక్క రూపాయి కూడా రాలేదు. అయితే వచ్చే నెలలో రోడ్డు పనులు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతుండడంతో ఆందోళన చెందుతున్నాడు.

# ఎన్‌హెచ్ 163.. పరిహారం పూర్తయ్యేదెన్నడు?

- ఇంకా పూర్తి కాని ప్రక్రియ
- అర్హుల్లో పలువురికి అన్యాయం!
- ఇళ్లు, భూమి, బావులు పోతున్నా పైసా ఇవ్వని వైనం
- పంపిణీ పూర్తి కాకుండానే వచ్చే నెలలో పనుల ప్రారంభానికి కసరత్తు
- ఆందోళనలో నిర్వాసిత ప్రజలు

**పెద్దపల్లి జిల్లా మీదుగా వెళ్తున్న నాగ్‌పూర్-విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ నేషనల్ హైవే(ఎన్‌హెచ్-163) నిర్వాసితులకు పరిహారం పరిహాసంగా మారుతున్నది. వచ్చే నెలలో పనుల ప్రారంభానికి యంత్రాంగం కసరత్తు చేస్తుండగా, ఇంకా పంపిణీలో జాప్యం జరుగుతున్నది. పలువురి భూముల్లో ఉన్న విలువైన ఇండ్లు, భూమి, బావులు పోతున్నా రికార్డు చేయకుండా, కొందరికి డబ్బులు ఇవ్వకుండా దాట వేస్తున్నట్టు తెలుస్తున్నది. అధికారులు ఇంకా పదిహేను శాతమే ఇవ్వాల్సి ఉందని చెబుతున్నా.. నిర్వాసితులు మాత్రం 30శాతం దాకా ఇవ్వాల్సి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందరికీ పరిహారం ఇచ్చిన తర్వాతే హైవే పనులు ప్రారంభించాలని స్పష్టం చేస్తున్నారు.**



పుట్టపాక వద్ద నేషనల్ హైవే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించనున్న మంథని-పెద్దపల్లి రహదారి

పెద్దపల్లి, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ) : నాగ్‌పూర్-విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ నేషనల్ హైవే (ఎన్‌హెచ్-163)లో భాగంగా మంచిర్యాల-వరంగల్ జిల్లాల మధ్య మొదటి ప్యాకేజీలో నిర్మించనున్న జాతీయ రహదారి నిర్వాసితులకు పరిహారం పంపిణీ నత్తనడకన సాగుతున్నది. గతేడాది జూలైలో హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో రహదారి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. కానీ, పదిహేను నెలలు గడిచినా పెద్దపల్లి జిల్లాలో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఎట్టకేలకు నవంబర్ 15 నుంచి పనులు మొదలవుతాయని ఇటీవల కలెక్టర్ ప్రకటించారు. అయితే భూసేకరణ, పరిహారం ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు.


### జిల్లాలో 15 గ్రామాల మీదుగా హైవే..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో కొత్తగా నిర్మించే జాతీయ రహదారి-163 నిర్మాణానికి 2021 ఫిబ్రవరి 3న గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ జాతీయ రహదారి మొత్తం 473 కిలోమీటర్లు కాగా, మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి మొదలై ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ముగుస్తుంది. 2027 కల్లా పూర్తిచేసే లక్ష్యంతో ఈ నాలుగు లైన్ల ఎక్స్‌ప్రెస్ హైవే పనులను ప్యాకేజీలుగా విభజించి చేపడుతున్నారు. మొదటి విడుత మూడో ప్యాకేజీ కింద మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండలం వేలాల నుంచి పెద్దపల్లి ముత్తారం మండలం ఓడేడ్ వరకు 37.96 కిలోమీటర్లు తీసుకున్నారు. అయితే రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఎన్నికలకు ముందు వేగంగా ప్రక్రియ సాగగా, ఆ తర్వాత మందకొడిగానే సాగుతున్నది. జిల్లాలోని మంథని, రామగిరి, ముత్తారం మండలాల్లోని 15 గ్రామాల మీదుగా హైవే వెళ్లనుండగా, ఇప్పటి వరకు 85శాతం మాత్రమే భూసేకరణ, పరిహారం పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ రహదారి పూర్తయితే మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలతోపాటు కరీంనగర్, జయశంకర్- భూపాలపల్లి జిల్లావాసులకు నేషనల్ హైవే అందుబాటులోకి రానుంది.

### పూర్తి కాని పరిహారం

ఈ రహదారి జిల్లా పరిధిలో మంథని మండలం ఉప్పట్ల నుంచి పోతారం, విలోచవరం, నాగారం, కన్నాల, పుట్టపాక, రామయ్యపల్లి, రామగిరి మండలం ఆదివారంపేట, బేగంపేట, నవాబ్‌పేట, ముత్తారం మండలం లక్కారం, కేశన్‌పల్లి, ముత్తారం, అడవి శ్రీరాంపూర్, ఓడేడు మీదుగా వరంగల్ జిల్లాలోకి వెళ్తుంది. మూడు మండలాలు, 15 గ్రామాల మీదుగా వెళ్లే ఈ దారి పొడవు 37.96 కిలోమీటర్లు కాగా, దీని నిర్మాణానికి 505.25 ఎకరాల భూమి అవసరమవుతుందని హైవే అథారిటీ సూచించింది. అయితే, భూసేకరణ, పరిహారం పంపిణీ పూర్తి కాకపోవడం, వచ్చే నెల నుంచి పనులు ప్రారంభకానున్న నేపథ్యంలో నిర్వాసిత రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు 15 శాతమే పరిహారం ఇవ్వాల్సి ఉందని చెబుతున్నారని, కానీ, నిజానికి 30 శాతం దాకా ఇవ్వాల్సి ఉందంటున్నారు. భూసేకరణలో భూముల్లో ఉన్న బోర్లకు, పైపు లైన్లకు, చెట్లకు, షెడ్లు, ఇతర నిర్మాణాలకు ఎలాంటి డబ్బులు ఇవ్వడం లేదని వాపోతున్నారు. తక్షణమే పరిహారం పంపిణీ చేయాలని, ఆ తర్వాతే పనులు ప్రారంభించాలని కోరుతున్నారు. కలెక్టర్‌కు వస్తూ అధికారులను వేడుకుంటున్నారు.

### మా ఊళ్లె 30 మందికి డబ్బులు పడలే



గ్రీన్ ఫీల్డ్ హైవే కింద మా ఆదివారంపేట గ్రామ శివారులో భూములు పోతున్నయి. ఇప్పటివరకు 30 మంది రైతులకు పరిహారం జమ కాలేదు. ఇంకా భూముల్లో ఉన్న బోర్లకు, బావులకు, పైప్ లైన్లకు, చెట్లకు డబ్బులు వేయలే. ఇంకా కొన్ని శాఖల వాళ్లు అసలు సర్వేనే చేయలేదు. ఎస్టిమేట్లు చేయలేదు. మిస్సింగ్ అయిన వాటి గురించి చెప్పినా పట్టించుకునే అధికారులు లేరు. వచ్చే నెల 15 నుంచి రోడ్డు పనులు ప్రారంభిస్తామని అంటున్నరు. పరిహారం ఇచ్చిన తర్వాతనే పనులు చేయాలి.

**-మైదం కుమార్, మాజీ సర్పంచ్ ఆదివారంపేట (రామగిరి మండలం)**

### పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు ప్రారంభించాలె



నాకు లక్కారం శివారులో 15 ఎకరాల భూమి ఉన్నది. దానికి తగ్గట్టుగానే పెద్ద బావి తవ్వించుకున్న. ఆ బావి నీళ్లే ఆధారం. అయితే, వ్యవసాయ భూమిలో నుంచి 4 గుంటల భూమి, బావి హైవే కింద పోతున్నది. అంత పెద్ద బావి, భూమి కోల్పోతున్నా ఇప్పటివరకు నాకు ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలె. అధికారులను అడిగితే వస్తాయని అంటున్నరు. ఇంకెప్పుడిస్తరో తెలుస్తలేదు. పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు ప్రారంభించాలి.

**- గొర్ల మహేశ్, మచ్చుపేట (ముత్తారం మండలం)**

తిమ్మాపూర్ శివారులో విరగబూసిన బంతిపూలను చూపుతున్న రైతు మాతంగి శంకర్





మల్లాపూర్: రాఘవపేటలో సాగు చేసిన బంతిపూల తోటలో సాతర్ల ప్రవీణ్

# లాభాల 'బంతి'

- పండుగలకు ప్రత్యేకం
- దీపావళికి సిద్ధంగా పూలు
- వినూత్న సాగుతో రైతులకు మేలు

తిమ్మాపూర్/ మల్లాపూర్, అక్టోబర్ 26 : పండుగ ఏదైనా బంతి పువ్వు ఉండాల్సిందే. డిమాండ్‌కు అనుగుణంగా వినూత్నంగా బంతి సాగును చేస్తూ లాభాలు గడిస్తున్నారు ఎంతో మంది రైతులు. తిమ్మాపూర్ మండలంలో ఏటా 20 ఎకరాల వరకు సాగు చేస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. ఒక్కో ఎకరం బంతి సాగుకు ₹50వేల పెట్టుబడి వస్తుండగా.. పూల దిగుబడి, ధరను బట్టి ₹2 లక్షల నుంచి ₹3 లక్షల వరకు లాభాలు వస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. ఒక్కో ఎకరంలో 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా.. ఇటీవలి బతుకమ్మ పండుగకు కిలో వంద చొప్పున విక్రయించగా లాభాలు గడించారు. మరోవైపు మల్లాపూర్ మండలకేంద్రంతో పాటు రాఘవాపూర్‌లో పలువురు రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించి బంతి సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మరో నాలుగైదు రోజుల్లో దీపావళి పండుగ వస్తుండడంతో మరోసారి 'బంతి'తోటలు సిరులు కురిపిస్తాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

